క్లుప్తంగా

సుందరంగా పార్కు



సుందరంగా తీర్చిదిద్దిన మొక్కలు

సాక్షి ఎఫెక్ట్..

ఏయూ క్యాంపస్: హార్బర్ పార్క్ ఎదురుగా ఉన్న పార్క్‌లో ఉద్యానవన సిబ్బంది కలుపు మొక్కలు తొలగించారు. ఇతర మొక్కలకు ట్రిమ్మింగ్ చేసి, కొమ్మలు తొలగించారు. ఇక్కడి సమస్యలపై 'కళావిహీనంగా పార్కు' శీర్షికతో ఈ నెల 29న ప్రచురితమైన కథనంపై జీవీఎంసీ అధికారులు స్పందించారు. ఇక్కడి మొక్కలకు వారంలో రెండు రోజులు నీరు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు.

సార్వత్రిక విద్యను ప్రోత్సహించాలి

ఆరిలోవ : ఓపెన్ స్కూల్ ప్రవేశాల ప్రక్రియను వేగవంతం చేయాలని ఏపీ సార్వత్రిక విద్య సూపరింటెండెంట్ గోపీకృష్ణ సూచించారు. తోటగరువులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సార్వత్రిక విద్య అధ్యయన కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఇక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసి ఎక్కువ సంఖ్యలో ప్రవేశాలు జరిగేలా చేయాలన్నారు. సార్వత్రిక విద్యను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆయనతోపాటు అసిస్టెంట్ కమిషనర్ మురళీ మోహన్, జయవర్మ పాల్గొన్నారు.

కార్పొరేటర్ భర్త మృతి



అప్పారావు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు కార్పొరేటర్ పల్ల అప్పలకొండ భర్త పల్ల అప్పారావు బుధవారం ఉదయం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం తుది శ్వాస విడిచారు. ఆయన మృతదేహానికి వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్ల దుర్గారావు, ఇతర నాయకులు నివాళులర్పించారు.

గ్రీన్ దివాళీ జరుపుకోవాలి



ప్లకార్డులతో ప్రచారం చేస్తున్న టీమ్ క్లైమేట్ ఫ్రంట్ సభ్యులు

ఏయూ క్యాంపస్ : ప్రజలంతా గ్రీన్ దివాళి జరుపుకునేందుకు ఆసక్తి చూపాలని టీమ్ క్లైమేట్ ఫ్రంట్ వైజాగ్ వ్యవస్థాపకురాలు ఓంద్రిలా అన్నారు. తమ బృంద సభ్యులతో కలిసి బీచ్ రోడ్డులో గ్రీన్ దీపావళిపై బుధవారం అవగాహన కల్పించారు. దీపాలు వెలిగించడం, చెట్లు నాటడం, మిఠాయిలు తినడం వంటి పనులు చేస్తూ దీపావళిని జరుపుకోవాలని కోరారు. దీపాల కాంతులతో పండగ జరుపుకోవాలని, ఇది జీవరాశికి ఎంతో మేలు చేస్తుందన్నారు. టపాసులకు దూరంగా ఉండాలని సూచించారు.

వీఎంఆర్‌డీఏ అటెండర్‌కు సన్మానం



రాజారావును సన్మానిస్తున్న వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రమేష్, ఇతర అధికారులు

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏలో 40 ఏళ్లపాటు అటెండర్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందిన మామిడి రాజారావును అధికారులు ఘనంగా సన్మానించారు. బుధవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సంయుక్త కమిషనర్, కార్యదర్శి రమేష్, ఇతర అధికారులు రాజారావు దంపతులను సాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ మాట్లాడుతూ రాజారావు 40 ఏళ్లపాటు నిబద్ధత, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి ఉన్నతాధికారుల మన్ననలు పొందుతూ సర్వీస్ పూర్తి చేశారని ప్రశంసించారు. కార్యక్రమంలో పరిపాలనాధికారులు నాగభూషణం, కార్తీక, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగుల పండగకు ప్రమిదల శోభ



దోసిలిలో దీపంతో..



ఆకట్టుకుంటున్న ప్రమిదలు



వివిధ ఆకృతులలో మట్టి ప్రమిదలు

- ఆకట్టుకుంటున్న వెరైటీ దీపాలు
- వివిధ ఆకృతుల్లో మట్టి ప్రమిదలు

మద్దిలపాలెం: వెలుగుల పండగ దీపావళికి వివిధ ఆకృతుల్లో మట్టి ప్రమిదలు సిద్ధమయ్యాయి. అమావాస్య చీకట్లను తొలగిస్తూ విభిన్న రీతుల్లో దీపమాలికలు ప్రతి ఇంటా కనువిందు చేయనున్నాయి. దీపావళిలో ప్రమిదలదే ప్రథమ స్థానం. దీంతో దివ్యకాంతుల్లో ప్రకాశించేలా ప్రమిదలకు మరిన్ని హంగులు అద్ది, వివిధ ఆకృతుల్లో మార్కెట్‌లో విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. నక్షత్ర దీపాలు, పంచముఖ దీపాలు, దీప స్తంభాలు, ఆకాశ దీపాలు, చిమ్నీ దీపాలు, పింగాణీ దీపాలు... ఇలా పలు రకాల దీప ప్రమిదలను మార్కెట్లో విక్రయిస్తున్నారు. మహిళలు తమ అభిరుచులకు అనుగుణంగా వాటిని కొనుగోలు చేస్తున్నారు.

నూనె లేకుండా వెలిగే దీపాలకు గిరాకీ

నూనె లేకుండా వెలిగే దీపాలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. ఇవి మహిళలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. బ్యాటరీతో, కరెంట్‌తో అచ్చం నూనె దీపంలా వెలుగులు విరజిమ్మే దీపాలు దుకాణాల్లో విక్రయిస్తున్నారు. నూనె అవసరం లేకపోవడంతో పాటు గాలి వీస్తే ఆరిపోతుందన్న భయం లేదు. పైగా ప్రతి సంవత్సరం వాడుకునే సౌలభ్యం ఉండటంతో బ్యాటరీ, విద్యుత్ దీపాలు కొనుగోలు చేసేందుకు మహిళలు ఆసక్తి చూపిస్తున్నారు.



లాంతరు దీపం

కలర్‌ఫుల్‌గా డిజైనర్ ప్రమిదలు

లేటెస్ట్ డిజైన్లలో కలర్‌ఫుల్‌గా చూడముచ్చటగా అలంకరించి డిజైనర్ ప్రమిదలను కొంతమంది విక్రయిస్తున్నారు. అలాగే పలు కంపెనీలు తయారు చేసిన డిజైనర్ ప్రమిదలను కోల్‌కతా నుంచి దిగుమతి చేసుకుని వ్యాపారులు, షాపింగ్ మాల్స్‌లో విక్రయిస్తున్నారు. వీటితో పాటు ఆకర్షణీయంగా పలు రకాల క్యాండిల్స్, డెకరేటివ్ క్యాండిల్స్ అందుబాటులోకి వచ్చాయి. ఫ్లోటింగ్ క్యాండిల్స్, సెంటెడ్ క్యాండిల్స్, వాటర్ క్యాండిల్స్, బ్యాటరీ క్యాండిల్స్, కుందన్ క్యాండిల్స్, జెల్ క్యాండిల్స్, క్యాండిల్ స్టాండ్స్ వివిధ రకాల్లో వ్యాపారులు విక్రయిస్తున్నారు. అలాగే విద్యుత్‌తో వెలిగే దీపాల సీరియల్ దండలు ఆకర్షణీయమైన రూపాల్లో మార్కెట్లో లభ్యమవుతున్నాయి.



విక్రయానికి సిద్ధంగా..

డిజైన్ కో ధర

మట్టితో తయారు చేసిన ప్రమిదలకు రంగులద్ది విక్రయిస్తున్నారు. ఈ ప్రమిదలు రూ.200 నుంచి రూ.500 వంతున విక్రయిస్తున్నారు. వినాయకుడు, లక్ష్మీదేవి, విగ్రహాల నమూనాలో ఉండే ప్రమిదలకు మంచి ధర పలుకుతోంది. వీటిలో లాంతర్ల నమూనా దీపాలు విక్రయిస్తున్నారు. ఒక్కో లాంతరు ప్రారంభ ధర రూ.200గా ఉంది. మగువ రూపంలో దోసిలిలో దీపంతో ఉండే దీపం జత రూ.200కు విక్రయిస్తున్నారు.

విమ్స్‌లో పోలీసుల విధులు



విమ్స్‌లో రక్త పరీక్షల కేంద్రం వద్ద కానిస్టేబుల్

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) లో పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 28న రాత్రి విమ్స్ సెక్యూరిటీపై ఓ యువకుడు మద్యం మత్తులో దాడి చేసి చేతి వేలు విరిచేసిన విషయం తెలిసిందే. దీంతోపాటు గతంలో కూడా ఇలాంటి సంఘటనలు పలుమార్లు విమ్స్‌లో చోటుచేసుకొన్నాయి. దీంతో విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి ప్రత్యేకంగా పోలీస్ అవుట్ పోస్టు విమ్స్‌లో ఏర్పాటు చేసి వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాలని విన్నవించారు. దీనికి స్పందించిన సీపీ కమిషనరేట్ నుంచి ఒక ఎస్‌ఐ, నలుగురు కానిస్టేబుళ్లను ఇక్కడ నియమించారు. వారు బుధవారం నుంచి విధులు నిర్వహిస్తున్నారు. వారిలో తప్పనిసరిగా ఇద్దరేసి విధులు నిర్వహించేలా డ్యూటీలు వేస్తున్నారు. ఇప్పటి నుంచి రాత్రి పగలూ ఇక్కడ పోలీసులు అందుబాటులో ఉంటారు. పోలీసులు లోపల ఓపీ, అత్యవసర విభాగం, ఇన్‌పేషెంట్ల వార్డులు, ల్యాబ్‌లు నిరంతరం పరిశీలిస్తున్నారు. దీంతో గొడవలు, దాడులకు అడ్డుకట్ట పడుతుందని విమ్స్ వైద్యులు, సిబ్బంది, రోగులు భావిస్తున్నారు.

వైభవంగా ధన్వంతరి వ్రతం



ధన్వంతరి వ్రతం చేస్తున్న మహిళలు

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం ధన త్రయోదశి, ధన్వంతరి జయంతిని నిర్వహించారు. ఆగమశాస్త్ర ప్రకారం బ్రహ్మశ్రీ కృష్ణ శర్మ బృందం ఈ వ్రతాన్ని చేయించారు. దాదాపు 250 మంది మహిళలు వ్రతంలో పాల్గొన్నారు. ధన్వంతరి వ్రతం విశిష్టతను వేదపండితులు వివరించారు. ఈ వ్రతాన్ని ఆచరించడం వలన పరిపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ వి.ఎస్.పి నార్త్ ఈస్ట్ వనిత లయన్స్ క్లబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వి.సాయి నిర్మల, ఎం.శుభాదేవి తదితరులు పాల్గొన్నారు.

జనశిక్షణ సంస్థాన్‌లో ఫిష్‌నెట్ మేకింగ్ కోర్సు

'పీఎం విశ్వకర్మ' పథకం ప్రారంభం

మద్దిలపాలెం: సంప్రదాయ వృత్తులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఉచిత శిక్షణతో పాటు తక్కువ వడ్డీతో రుణం అందించే 'పీఎం విశ్వకర్మ' పథకాన్ని జన శిక్షణ సంస్థాన్‌లో ప్రారంభించామని స్కిల్ డెవలప్‌మెంట్ రీజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. పితాపురం కాలనీలోని జన శిక్షణా సంస్థాన్ ప్రాంగణంలో బుధవారం ఆయన ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎం విశ్వకర్మ యోజన పథకంలో ఫిష్ నెట్ మేకింగ్ వృత్తి విద్యా కోర్సుకు దరఖాస్తు చేసుకున్నవారు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. జన శిక్షణ సంస్థాన్ అధ్యక్షుడు సి.ఎ. రామరాజు మాట్లాడుతూ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న వారు కచ్చితంగా నిర్ణీత కాలం హాజరు కావాలని, బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా శిక్షణ పూర్తి చేసిన ప్రతి లబ్ధిదారునికి, ప్రభుత్వం ద్వారా ఉచితంగా టూల్ కిట్స్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థాన్ సంచాలకుడు సి.హెచ్.అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



పథకం గురించి వివరిస్తున్న ఏడీ శ్రీకాంత్

డీఈవోకు సత్కారం



డీఈవోకు అభినందనలు తెలుపుతున్న పీఆర్‌టీయూ నాయకులు

విశాఖ విద్య: జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ప్రేమ్‌కుమార్‌ను బుధవారం పీఆర్‌టీయూ జిల్లా కమిటీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. జిల్లాపై పట్టు ఉన్న అధికారిగా విద్యాశాఖను పురోభివృద్ధిలో నడిపిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం. శ్రీనివాసరావు, కొమ్మునాపల్లి నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు బి. మహేష్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వాగత వేడుకలు



ఏయూ తెలుగు విభాగంలో ఆహ్వాన వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ తెలుగు విభాగంలో ఎంఏ తెలుగు మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థుల స్వాగత వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా విభాగాన్ని తీర్చిదిద్దటం ఆనందంగా ఉందన్నారు. విశ్వవిద్యాలయ భద్రతా విభాగాధిపతి ఆచార్య అరుణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం శ్రమిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. సీనియర్ విద్యార్థులు ఇస్సాకు, శివ, గోవింద, అంజని జూనియర్ విద్యార్థులకు తమ అనుభవాలను వివరించారు. ఆహ్వాన వేడుకల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ అన్నంశెట్టి ఈశ్వరమ్మ, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ కట్టిపోగు రత్నశేఖర్, డాక్టర్ పెండ్యాల లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతులు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గ పరిధిలోని పలు వార్డుల్లో సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుకు బుధవారం వినతిపత్రాలు అందించారు. ఎమ్మెల్యే తన కార్యాలయంలో అర్జీలు స్వీకరించి, పరిష్కారానికి కృషి చేస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్‌లో సమస్యలపై రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందించారు. 13వ వార్డు పరిధి రామకృష్ణాపురంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గ్రామాభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు.

పీఎంఈజీపీపై అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఈడీ సత్యపద్మ

ఎంవీపీ కాలనీ : ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం (పీఎంఈజీపీ)పై జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ ఏడీ వి.పద్మ, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎం.ఎస్.సత్యపద్మ పాల్గొని ఎస్సీ యువకులకు పథకంపై అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం, సబ్సిడీ, అర్హతలు, దరఖాస్తు విధానాన్ని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ ఎస్సీ సంఘాల యువకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీచ్‌రోడ్డులో ఫ్రీడం రన్

ఏయూక్యాంపస్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫిట్ ఇండియా స్వచ్ఛత ఫ్రీడం రన్ 5.0 ని డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ (జిల్లా క్రీడ ప్రాధికార సంస్థ) ఆధ్వర్యంలో నిర్వహించారు. గురువారం ఉదయం బీచ్ రోడ్డులో నిర్వహించిన ఈ రన్‌లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆరోగ్యంగా ఉండాలని, స్వచ్ఛతకు ప్రాధాన్యం ఇవ్వాలని వారంతా నినదించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

టపాసులతో వినికిడి శక్తి కోల్పోవద్దు

ఎంవీపీ కాలనీ : దీపావళి వేడుకలు పర్యావరణ హితంగా నిర్వహించుకోవాలని, టపాసుల వంటి పేలుడు, బాణసంచాను వినియోగించడం ద్వారా వినికిడి శక్తిని కోల్పోవద్దని కేజీహెచ్ విశ్రాంత ఈఎన్‌టీ వైద్యుడు డాక్టర్ బి.రామకృష్ణ సూచించారు. ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాణసంచా వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. అతిగా శబ్దం కలిగించే టపాసుల వినియోగం ప్రమాదకరమన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, గ్రీన్ క్లైమేట్ కార్యదర్శి జేవీ రత్నం, ప్రిన్సిపల్ జగదీశ్వరరావు పాల్గొన్నారు.

రేపు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

ఆరిలోవ: విమ్స్ సబ్‌స్టేషన్ 33/11 కేవీలో ఇందిరానగర్ ఫీడర్ 11 కేవీ పరిధిలో నవంబరు 1న విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నందున సంబంధిత ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఇందిరానగర్, రాజీవ్‌నగర్, సుందర్‌నగర్, రవీంద్రనగర్, తదితర ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాల్సిందే



ఆరిలోవ సబ్ స్టేషన్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఆరిలోవ: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఆరిలోవ సీపీఐ జోన్ ఆధ్వర్యంలో బుధవారం ఆరిలోవ ప్రాంతంలో ర్యాలీ చేపట్టారు. ఆరిలోవ కాలనీలో చేపట్టిన ఈ ర్యాలీ హెల్త్‌సిటీలో ఉన్న ఆరిలోవ సబ్ స్టేషన్ కార్యాలయం వరకు సాగింది. అక్కడ కొంతసేపు ధర్నా చేపట్టారు. పెరిగిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని నినాదాలు చేశారు. అనంతరం అక్కడ అధికారులకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జోన్ నాయకులు రెహమాన్, విమల, దేవుడమ్మ, లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలపై మోయలేని భారం పడుతుందన్నారు. సామాన్య కుటుంబాలు, రైతులు, చిన్న వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ చార్జీలు పెరగడం వల్ల కొందరు స్వయం ఉపాధి కోల్పోయే పరిస్థితి వస్తుందన్నారు. పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.

విద్యతోనే అవినీతి నిర్మూలన



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అనీఫ్, మధురవాణి

ఏయూక్యాంపస్: అందరూ విద్యావంతులైతేనే అవినీతి నిర్మూలన సాధ్యమని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈస్ట్ పాయింట్ కాలనీ సీనియర్ మేనేజర్ అనీఫ్ అన్నారు. కేంద్ర నిఘా వారోత్సవాల సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గాయత్రి విద్యా పరిషత్ సంయుక్తంగా నిఘా వారోత్సవాలు నిర్వహించాయి. అందులో భాగంగా శనివారం ఉదయం పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. బీచ్ రోడ్ లోని గాయత్రి విద్యా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ప్రధాన మేనేజర్ అనీఫ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల సమాజంలో అవినీతి మూలాలు తొలగించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ప్రాథమిక స్థాయినించే అదుపు, పొదుపు, మదుపు అనే విషయాలు పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. నిబద్ధత, స్వచ్ఛతతో కూడిన జీవన విధానం విద్యార్థులకు అవసరమన్నారు. తొలుత జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 100 మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విజేతలకు జ్ఞాపికలతో పాటు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె. మధురవాణి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆంధ్రా బ్యాంక్ మేనేజర్ సతీష్, మణికంఠ, ఇతర సిబ్బంది, గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి దక్షిణామూర్తి, కామేశ్వరరావు తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

33వ క్రాకర్స్ షాపు ఎవరిదీ..?

- ఏఎస్ రాజా మైదానంలో అనధికారిక షాపు..?
- పూర్తి స్థాయి అనుమతులు లేకున్నా విక్రయాలు
- జీవీఎంసీ రికార్డుల్లో 32 షాపులకే అనుమతులు



ఏఎస్ రాజా మైదానంలో బాణసంచా విక్రయాల దుకాణాలు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో క్రాకర్స్ విక్రయాల కోసం అనధికారిక షాపు ఏర్పాటు చేయడం కలకలం రేపింది. జీవీఎంసీ జోన్ – 3 యంత్రాంగం ఇక్కడ 32 షాపుల నిర్వహణకే అనుమతి మంజూరు చేసినట్లు రికార్డుల్లో ఉండగా మైదానంలో మాత్రం 33 షాపుల ద్వారా విక్రయాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ షాపు ఎవరి పేరు మీద ఉంది..?, దానికి అనుమతులు ఉన్నాయా..?, ఉంటే జీవీఎంసీ రికార్డుల్లో ఎందుకు నమోదు కాలేదు..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై జీవీఎంసీ, ఎంవీపీ పోలీసు విభాగం అధికారులు వేర్వేరుగా వివరాలు అందించడం చర్చనీయాంశమైంది. జీవీఎంసీ అధికారులు ఇక్కడ తొలి నుంచి 32 షాపులకే అనుమతి మంజూరు చేసినట్లు వెల్లడిస్తుండగా ఎంవీపీ పోలీసులు మాత్రం 33వ నంబరు షాపు నిర్వాహకులు చివరిలో అనుమతులు పొందినట్లు వెల్లడిస్తున్నారు. ఇందులో ఏయూ మైదానంలో 150 షాపులు, ఏఎస్ రాజా మైదానంలో 32 షాపులు, ఎంవీపీ డబుల్ రోడ్డులో 4 షాపులు, వీఎంఆర్‌డీఏ పార్కులో 2 షాపులకు అనుమతులు ఇచ్చినట్లు వెల్లడిస్తున్నారు. 'బాణసంచా స్టాళ్ల పేరిట దందా' శీర్షికతో సాక్షిలో ఇటీవల కథనం ప్రచురించిన తర్వాత అసోసియేషన్ ప్రతినిధులు 33వ షాపు కోసం సైతం అనుమతులకు ప్రయత్నించినట్లు తెలిసింది. అయితే అప్పటికే దరఖాస్తు సమయం మించిపోవడంతో ఆ షాపునకు పూర్తి స్థాయి అనుమతులు లేవని పలువురు వ్యాపారులు వెల్లడిస్తున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులతో పాటు నగర పోలీసు శాఖ ఉన్నతాధికారుల కళ్లుగప్పి అనధికారిక షాపు ద్వారా విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం.

జోన్ - 3 అధికార యంత్రాంగంలో భారీ మార్పులు

ఎంవీపీ కాలనీ : జోన్ – 3 అధికార యంత్రాంగంలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. పాలన పరమైన అంశాల్లో కీలకమైన ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారుల మార్పులే ఇందుకు కారణం. గత కొన్నాళ్లుగా జరుగుతున్న బదిలీల్లో భాగంగా జోన్ – 3 పరిధిలోని ఆయా విభాగాల్లో జీవీఎంసీ ప్రధాన కార్యాలయం అధికారుల ఉత్తర్వుల మేరకు మార్పులు జరిగాయి. జోన్ – 3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఈ.గంగాధర్, డీఈలుగా పద్మావతి, విజయ్‌కుమార్ నియమితులయ్యారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీగా మధుసూదన్‌రావు బాధ్యతలు స్వీకరించారు. టౌన్‌ప్లానింగ్ టీపీఎస్‌గా గోపన్న నియమితులయ్యారు. ప్రస్తుతం ఉన్న ఇంజినీరింగ్ ఏఈలలో పలువురు బదిలీకాగా అప్పలనాయుడు, భాగ్యశ్రీ కొత్తగా బాధ్యతలు చేపట్టారు.

పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఏయూక్యాంపస్: పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ విశాఖ పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బుధవారం సాయంత్రం విక్టరీ ఎట్ సీ నుంచి అమరవీరుల స్మృతి స్థూపం వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవాలన్నారు. అమరవీరుల కుటుంబాలకు మనం ఎల్లవేళలా అండగా ఉండాలని కోరారు. దేశం కోసం, రాష్ట్రం కోసం, మన నగరం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీపీ(లా అండ్ ఆర్డర్) అజిత వేజెండ్ల, జాయింట్ సీపీ(ఇన్‌చార్జ్) డీసీపీ-2 డి.మేరి ప్రశాంతి, నగర ఏడీసీపీలు, ఏసీపీలు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.